www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025

5

తిరుపతి



శ్రీ చెంగాలమ్మ హుండీ ఆదాయం రూ.69 లక్షలు...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి పరాకామణి (హుండీ లెక్కింపు)గురువారం జరిగినది. 102 రోజులకు గాను రూ.59,79,520లు నగదు, బంగారం :048 గ్రాములు, వెండి:069 గ్రాములు, విదేశీ కరెన్సీ:యు.ఎస్.ఎ డాలర్స్-185, సింగపూర్ డాలర్ 15, యూఏఈ ధీరామ్స్-30, సౌదీ రియాల్స్-15,సెంట్రల్ బ్యాంక్ -1/2 దినార్,నేపాల్ రూపాయి10 ఆదాయం చేకూరింది. గూడూరు దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ యం.సుధీర్ బాబు పర్యవేక్షణలో,సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ సమక్షంలో లెక్కింపు జరిగింది.

ప్రయాణికులు బేజారు

'మోడీ జీఎస్టీ సక్సెస్ సభ' ఎఫెక్ట్
ఆర్టీసీ బస్సులు 'కర్నూలు బాట'



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల్లేక ప్రయాణికులు నిరీక్షణ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ సక్సెస్ సభ కర్నూల్లో గురువారం జరిగింది. మోడీ సభ సక్సెస్ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం భుజాన వేసుకుంది. జనాలను తరలించేందుకు ఆర్టీసీ సర్వీసులను పెద్దమొత్తంలో వినియోగించారు. బస్సులన్నీ కర్నూలు బాట పట్టడంతో గమ్యస్థానం చెరుకునేందుకు సర్వీసుల్లేక ప్రయాణికులు, యాత్రికులు బస్టాండ్ లోనే పడిగాపులు కాస్తుండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు వెయ్యి ఆర్టీసీ సర్వీసులు 'కర్నూలు బాట' పట్టాయని సమాచారం.

దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం జీఎస్టి సక్సెస్ సభలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్లోని కర్నూల్లో జీఎస్టీ సక్సెస్ సభ గురువారం నిర్వహించారు. ప్రధాని ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సూపర్ సిక్స్, జీఎస్టి సక్సెస్ పేరుతో సభను ఏర్పాట్లు చేసింది. మోడీ సభను విజయవంతం చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఇంకేముంది ఆ సభకు కనీసం లక్ష మందిని తరలించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జనాల తరలింపుకు వారి వద్దనున్న ఏకైక మార్గం ఆర్టీసీ. నెలకు ముందే అన్ని ఆర్టీసీ డిపోల అధికారులకు కర్నూలు మోడీ సభకు వీలైతే ఎక్కువ బస్సులు సిద్ధం చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడంతో ఇక్కడ ఆర్టీసీ అధికారులు ఎక్కువ బస్సులు పంపేందుకు సిద్ధమయ్యారు. ఇంకేముంది బుధవారం మధ్యాహ్నానికే ప్రతి గ్రామానికి, మారుమూల ప్రాంతాలకు సైతం బస్సులు చేరుకున్నాయి. దీంతో తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్ బస్సులు లేక బోసిపోయింది. కేఎస్ఆర్టిసి (కర్నాటక) టీఎన్ఆర్టిసి (తమిళనాడు) సర్వీసులే జిల్లా వాసులకు దిక్కు అయ్యాయి. సప్తగిరి సర్వీసులన్నీ తిరుపతి తిరుమల మధ్య నడుపుతూ, ఉన్న అర కొర పల్లె వెలుగు బస్సులను పుంగనూరు, పీలేరు, రాజంపేట, శ్రీకాళహస్తికి మళ్ళించారు. చిత్తూరు వైపు వెళ్లే వాళ్లకి కష్ణగిరి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ, కేఎస్ఆర్టిసి బస్సులే దిక్కయ్యాయి. జిల్లా నలుమూలలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఇతరత్రా ప్రాంతాలకు దర్శనానికి వెళ్లాల్సిన యాత్రికులు బస్సులు లేక తీవ్ర అవస్థలు పడ్డారు. చనిపోయిన బంధువులను కడసారి చూసుకునేందుకు వెళ్లలేక, బంధువుల దినకర్మలకు, పెళ్లిళ్ల ఇతరత్రా శుభకార్యాలకు హాజరయ్యేందుకు తమ ఊర్లకు వెళ్లలేక జిల్లా వాసులు అవస్థలు పడ్డారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా 500 పైనే ఆర్టీసీ సర్వీసులను మోడీ సభకు తరలించినట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం 330 బస్సులను పంపినట్లు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యి పైనే బస్సులు కర్నూలు బాట పట్టాయని సమాచారం.

సాగరమాల ప్రాజెక్ట్ పూర్తి చేయండి :కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

సాగరమాల ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. తిరుపతి జిల్లాలో సాగరమాల ప్రాజెక్టు కింద గ్రీన్ ఫీల్డ్ హైవేల పనులను గురువారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టులు మొత్తం నాలుగు ప్యాకేజీలుగా రూపుదిద్దుకున్నాయి. సుమారు 3000 కోట్ల వ్యయంతో 125 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ రోడ్లు ప్రధానంగా చెన్నై-కోల్కతా నేషనల్ హైవేను కృష్ణపట్నం పోర్టుతో అనుసంధానించేలా రూపకల్పన జరిగింది. ప్రధాన ప్యాకేజీలు నాయుడుపేట - కృష్ణపట్నం పోర్టు (సౌత్ గేట్) వరకు సుమారు 36 కిలోమీటర్లు, వరగలి క్రాస్ -కృష్ణపట్నం పోర్టు వరకు సుమారు 35 కిలోమీటర్లు, ముత్తుకూరు పరిధిలో సుమారు 19 కిలోమీటర్ల ప్యాకేజీ, ఇంకో ఇంటర్నల్ కనెక్టివిటీ ప్యాకేజీ కలిపి మొత్తం నాలుగు ప్యాకేజీలు ఉన్నాయన్నారు.. ఈ నాలుగు ప్యాకేజీలలో మూడు తిరుపతి జిల్లా పరిధిలో, ఒక ప్యాకేజీ నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నాయని ఈరోజు అన్ని ప్యాకేజీలను సైట్‌లో పరిశీలించి, భూసేకరణ, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖలతో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కార చర్యలు చేపట్టామన్నారు. ఈ పనులలో మూడు ప్యాకేజీలు 2025, డిసెంబర్ నాటికి, మిగతా ప్యాకేజీ 2027 జూన్ నాటికి పూర్తి కానున్నాయని అన్నారు. ఈ హైవేలు పూర్తయిన తర్వాత కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ మరింత బలపడుతుందన్నారు. దీని వలన ప్రాంతీయ పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరింత పెరుగుతాయన్నారు.

అదేవిధంగా కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (క్రిస్ సిటీ) ప్రాజెక్టు కింద సుమారు 2500 ఎకరాల్లో 1200 కోట్లతో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివద్ధి పనులు కొనసాగుతున్నాయి.ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి 2025, జనవరిలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే 200 కోట్లకు పైగా పనులు పూర్తి అయ్యాయి. ఈ ప్రాజెక్టు కూడా 2026 డిసెంబర్ నాటికి పూర్తి కానుందని, మొత్తం 4500 కోట్లకు పైగా విలువైన అభివద్ధి పనులు గూడూరు నియోజకవర్గ పరిధిలో శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ పనుల పురోగతిని సమీక్షించడానికి ఈరోజు సంబంధిత లైన్ డిపార్ట్మెంట్లు, ఎన్‌హెచ్ఎఐ అధికారులతో సమీక్షించామన్నారు.

రుయాలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రుయా ఆస్పత్రిలో తొలగించిన 50 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విషయం విదితమే. గురువారం డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ పద్మావతి కంపెనీ కాంట్రాక్టర్ భాస్కర్‌నాయుడు టెండర్ తీసుకుని ఎనిమిది రోజులు పని చేయించుకుని, తొమ్మిదో రోజు నుంచి మీకు యాభై ఏళ్లు దాటాయి కాబట్టి పనికి రావద్దంటూ హఠాత్తుగా తొలగించడం సరైంది కాదన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎసిఎల్‌కు వినతిపత్రం ఇచ్చారు.కాంట్రాక్టర్ ఏది అనుకుంటే అది చట్టం కాదని, కాంట్రాక్టర్ రాసుకున్న ఎంఒయు కార్మిక చట్టం కాదని, కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్టు కార్మికులు 60 సంవత్సరాల వరకు పని చేయవచ్చని తెలిపారు. తొలగించిన కార్మికులను యధావిధిగా విధుల్లోకి తీసుకునా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె.వేణుగోపాల్, సిఐటియు నగర అధ్యక్షురాలు పి.బుజ్జి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చినబాబు పాల్గొన్నారు. ఎసిఎల్ స్పందిస్తూ ఖచ్చితంగా కార్మికులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా వివరించారు. తొలగించిన కార్మికులు లక్ష్మమ్మ, బి.రాణి, వై.లక్ష్మమ్మ, ఎస్‌బిబి, పి.సుబ్రమణ్యం, పి.రామ్మూర్తి, కె.సుబ్రమణ్యం, పి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.





చెరువులను అభివృద్ధి చేస్తాం

తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తుడా పరిధిలో ఉండే చెరువులను అభివృద్ధి చేయడమే తమ కర్తవమని చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తెలిపారు. గురువారం అవిలాల చెరువును సందర్శించారు. చెన్నైకి చెందిన ఎన్ వీరాన్ మెంటలిస్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు అరుణ్ కష్ణమూర్తితో కలిసి చైర్మన్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ 19 రాష్ట్రాల్లో 650 చెరువులను ఈ సంస్థ అభివృద్ధి చేసిందని అన్నారు. అవిలాల చెరువును అభివృద్ధి చేసి భూగర్భ జలాలు పెంపొందించడానికి కషి చేస్తామన్నారు. అవిలాల చెరువు డ్రోన్ సర్వే తో పరిశీలించిన తర్వాత ఎలా అభివృద్ధి చేయాలో దాన్నిబట్టి ముందుకు వెళ్తామని చెప్పారు . తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తుడా పరిధిలో 20 చెరువులను అభివద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. 82 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అవిలాల చెరువు అభివృద్ధి చేయడమే కాకుండా పర్యాటక రంగంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ నారావారిపల్లి సహ కన్సల్టెంట్ వెంకట్, ఉద్యానవన అధికారి మాలతి, తుడ ఇంజినీర్ మురళీమోహన్ పాల్గొన్నారు

మహిళా వర్సిటీలో 'యుద్ధం-శాంతి' కవి సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, ఈతరం కవితా వేదిక సంయుక్తంగా దీపావళి కవి సమ్మేళనం ఇంజనీరింగ్ కాలేజ్ లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు ఆచార్య మధుజ్యోతి మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధ వాతావరణం నేడు అందరూ చవిచూస్తున్నారని, దీనిపట్ల విద్యార్థులలో అవగాహన ఏర్పరచడానికి 'ప్రపంచం-యుద్ధం- శాంతి' అనే అంశాన్ని కవిత్వ పోటీ కోసం ఎంచుకున్నామన్నారు. కవిత్వం ఒక కళ అని, నేటితరం విద్యార్థులలో కవిత్వం రాసే కళను పిల్లల్లో పెంపొందించాలని ఆశించారు. కార్యక్రమ ముఖ్య అతిథి ఈతరం కవితా వేదిక ఆచార్య చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు కథలపై మక్కువతో కథలను ఎక్కువగా రాయగలుగుతున్నారు. నాటి కవులు శ్రీ శ్రీ, కృష్ణశాస్త్రి వంటి వారి కవిత్వంలో యువత చైతన్యం పెంపొందించుకొని కవిత్వం రాయాలని అన్నారు. అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తులో జరగబోయే అంశాలను తెలిపేది కవిత్వం. ఈ పోటీలో మొదటి బహుమతి ఎ. మోహిత, రెండవ బహుమతి పి. మాధవి, మూడవ బహుమతి ఎన్. వాసవి అందుకున్నారు. ఎమ్.ఫరీద న్యాయశాఖ, బి. జయలక్ష్మి ఎమ్ఎమ్ఎమ్, వి.వెంకటలావణ్య, కె.వసంతశోభారెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ఈ వచన కవిత్వ పోటీకి న్యాయనిర్ణేతులుగా డా.వై.సుభాషిణి, డా.బి. లక్ష్మిప్రియ వ్యవహరించారు. ఆకుల మల్లేశ్వర రావు, డా.దుబగుంట్ల రామకృష్ణ, బత్తుల రవి, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, కె.విశ్వనాథ్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.





జయంపు గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

వివాదాస్పద స్థలం తహశీల్దార్ పరిశీలన

ప్రజాశక్తి - బాలాయపల్లి

మండలంలోని జయంపు గ్రామంలోని సర్వే నంబర్ 158/7లో గల 0.03 సెంట్లు స్థలం గ్రామానికి చెందిన పండ్లూరు కష్ణారెడ్డి, పొదలకూరు వెంకటేశ్వర్లు నాయుడు మధ్య వివాదాస్పదంగా ఉంది. ఈ స్థలాన్ని గురువారం తహసీల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వివాదాస్పదంగా ఉన్న స్థలం రికార్డుల పరంగా గ్రామ కంఠం భూమి అని, పంచాయతీ స్వాధీనం చేసుకున్నట్లు తీర్మానం చేసి, బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పూజిత, విఆర్ఒ చైతన్య పాల్గొన్నారు.

పదిమందికి ఉపయోగపడాలి : సిపిఎం

పదిమందికి ఉపయోగపడే భూమిని తహశీల్దార్ చెప్పిన విధంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బోర్డు పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. ఉమ్మడి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువతీ, యువకుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 10 మెగా కంపెనీలు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 220 మంది ఆసక్తి ఉన్న అభ్యర్థులు హాజరయ్యారు. 123 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో 47 మంది మహిళా కళాశాల విద్యార్థినులే కావడం గమనార్హం. ఎన్నికైన అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి . రాజశేఖర్ ఆఫర్ లెటర్స్ ను అందజేశారు. జేకేసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఉషారాణి, లక్ష్ ఫౌండేషన్ ప్లేస్ మెంట్ మేనేజర్ భాను చంద్రారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ పి.భారతి, వైస్ ప్రిన్సిపాల్ వి .కె దీనదయాల్, ఫిజికల్ డైరెక్టర్ ఏ. నరసింహారావు, సుమతి పాల్గొన్నారు.

నేటి యువతే దేశ అఖండ సంపద

యువతరంగ్'లో వీసీ నరసింగరావు

ప్రజాశక్తి - క్యాంపస్

నేటి యువతే దేశానికి నిజమైన అఖండ సంపదని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు అన్నారు. ఎస్వీయూలోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే యువతరంగ్ - 2025 కార్యక్రమం గురువారం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించారు. ప్రారంభోత్సవంలో వీసీ ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ మానవ జీవితానికి కళలు, సాహిత్యం వంటివి అవసరమని, అవి మనిషిని ఆదర్శంగా మారుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కతి, సంప్రదాయాలకు కళలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. అయితే, వీలైన మేరకు సంగీతాన్ని నేర్చుకున్నానని చెప్పారు. క్రీడా , సాంస్కతిక రంగాల్లో యూనివర్సిటీ మంచి గుర్తింపును సంతరించుకోవడం శుభపరిణామం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సాంస్కతిక అభివద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. తాను యూనివర్సిటీలో చదువుకునే సమయంలో యూత్ ఫెస్టివల్ ఎంతో ఆనందాన్ని ఇచ్చేదన్నారు. అంతకు రెట్టించిన ఉత్సాహంతో యువతరంగ్ -2025 గొప్పగా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దడం అవసరం అన్నారు. చదువుతోపాటు మన సంస్కతి, సాంప్రదాయాలను తెలియజేయడానికి కళలే ఆధారమని అన్నారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ యువతరంగ్- 2025 ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైందని తెలిపారు. ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. యువతరంగ్- 2025 ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఉత్తేజం పొందానని తెలిపారు. తనకు వచ్చిన గుర్తింపుకు యువత ముఖ్యకారణం అన్నారు. భవిష్యత్తులోనూ తనను ఇదేవిధంగా ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. తొలినాళ్ళలో తనకు లక్ష్యం ఏమిటో అర్థం కాలేదని తెలిపారు. పాతికేళ్ళ వయసులో జీవిత లక్ష్యం అర్థమైందనీ, కళాకారుడిగా రాణిస్తానని నమ్మకం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ డీన్ చెంద్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బివి మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఉదయం 9.30 గంటలకు యువతరంగ్- 2025 ప్రారంభ సూచికగా యూనివర్సిటీలో భారీర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం వరకూ కళాబందాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. వివిధ రకాల వేషధారణలతో కళా ప్రదర్శనలతో కళాకారులు అందరినీ ఆకట్టుకున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కళా బందాలు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తారు.



సాంస్కృతిక కార్యక్రమాలతో యువతరంగ్ ర్యాలీ

వ్యసనం..పర్యవసానం...



ముంగిలిపట్టు దళితవాడలో విషాదం

ప్రజాశక్తి - చంద్రగిరి

ముక్కుపచ్చలారని బాల్యం మద్యానికి బానిసయ్యింది.. స్కూలుకు తీసుకెళ్లే బ్యాగులో పుస్తకాలతో పాటు, మద్యం బాటిల్ తోడయ్యింది.. బిడ్డ మద్యం తాగుతున్నాడని తెలిసినా బుద్ధిగా నాలుగు మాటలు చెప్పి మార్చుకునే ప్రయత్నం చేసే తీరిక కూలికెళ్లే ఆ తల్లిదండ్రులకు లేకుండా పోయింది.. పాఠశాలలో విద్యార్థి దురలవాట్లపై దృష్టిపెట్టి కౌన్సిలింగ్ ఇచ్చి భావిభారత పౌరునిగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు ఆ దిశగా యోచన చేయలేదు.. పర్యవసానం టెన్త్‌క్లాస్ విద్యార్థి యశ్వంత్ ఆత్మహత్యకు దారితీసింది.. ప్రధానోపాధ్యాయునికి తెలిసిపోయిందని పారిపోయే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రైలు కిందపడ్డాడా? కావాలనే ఆత్మహత్య చేసుకున్నాడో.. ఏమైతేనేం తల్లిదండ్రులకు దు్ఖఃన్ని మిగిల్చింది ఈ ఘటన. ముంగిలిపట్టు దళితవాడలో విషాదాన్ని నింపింది.. కూలికెళ్లి ఇంటికొచ్చే తండ్రి తాగిరావడం, ఊరంతా బెల్టుషాపుల ప్రభావం, జాతర జరిగిందంటే ఏరులై మద్యం పారడం గ్రామాల్లో 'బాల్యం'పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. బడి, గుడి పక్కనే బెల్టుషాపులు రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో ఇటువంటి ఘటనలు బాధాకరమనే చెప్పాలి.



పాఠశాల ప్రహరీగోడ దూకి రైల్వేట్రాక్‌పై విద్యార్థి ఆత్మహత్య (నిన్నటిది)

చంద్రగిరి మండలం ముంగిలిపట్టు దళితవాడలో రమేష్, జ్యోతి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. ఇద్దరూ గ్రామ పరిధిలోని కొంగరవారిపల్లి హైస్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. పెద్దకొడుకు యశ్వంత్ (15) పదో తరగతి చదువుతూ గ్రామంలోని పోకిరి వాళ్లతో చేరి దురలవాట్లకు బానిసయ్యాడు. తెలిసితెలియని వయస్సు, ఆపై మద్యం అలవాటు.. ఇది చూసిన తోటి విద్యార్థులు తరగతి గదిలోనే మద్యం తాగడం చూసి ఉపాధ్యాయులకు తెలిపారు. హెడ్‌మాస్టర్ భాస్కర్‌నాయుడు విద్యార్థిని మందలించి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో యశ్వంత్ భయభ్రాంతులకు గురై పాఠశాల ప్రహరీ గోడ దూకి రైల్వే ట్రాక్‌పైకి పరిగెత్తాడు. అదే సమయంలో రైలు వస్తుండడంతో రైలు ఢీకొని మృతిచెందాడు. దీంతో ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాకాల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. విద్యార్థి మృతితో ముంగిలిపట్టు దళితవాడ శోకసంద్రమయ్యింది.

మద్యం మత్తులో భార్యపై పెట్రోల్ పోసి...


ప్రజాశక్తి - చంద్రగిరి



చంద్రగిరి పట్టణంలో మంగళవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ పొలంలో వాచ్మెన్ గా పనిచేస్తున్న వెంకటేష్, హరిత దంపతులు. రాత్రి మద్యం మత్తులో భార్య పై పెట్రోల్ పోసి భర్త వెంకటేష్ నిప్పంటించాడు. తీవ్రగాయాలతో ఉన్న భార్యను హాస్పిటల్లో చేర్పించారు. ఈ ఘటనలో గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా, వారిలో ఒకరు గతంలోనే మతి చెందగా, ప్రస్తుతం ఒక కుమారుడు మాత్రమే వీరితో ఉన్నాడు. ఈ దారుణానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పాలిటెక్నిక్ కళాశాల పక్కనే తాగుబోతుల గుంపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



పుత్తూరు - తిరుపతి జాతీయ రహదారి సమీపంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిరోజూ సాయంత్రం ఆర్టీసీ బస్సులో తిరిగి ఇళ్లకు వెళుతుంటారు. అయితే పిల్లారిపట్టు జంక్షన్ వద్ద రోజూ మద్యం తాగి గుమిగూడే తాగుబోతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విద్యార్థులను తీసుకెళుతున్న ఆర్టీసీ బస్సువద్దకు లారీ ఒక్కసారిగా దూసుకొచ్చింది. లారీడ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని పక్కకు వాల్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తాగుబోతుల గుంపులు రోజువారీ ఇక్కడ గుమిగూడుతుండడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రవాణా, పోలీసు, ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యాయమూర్తిపై దాడి బాధాకరం



నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతామోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నామని, దేశవ్యాప్తంగా దళితులపై దాడులు ఎక్కువైపోయాయని కాంగ్రెస్ పార్టీ తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. గురువారం గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రిలే దీక్షలకు సంఘీభావం

ప్రజాశక్తి - చంద్రగిరి: గత నెల 30 తేదీ నుంచి తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు దశల వారీగా గ్రామస్థాయి, మండలస్థాయి, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో తెలుగు విధుల నిర్వహిస్తూ ఆందోళన చేశారు. ప్రభుత్వం దిగిరానందున, కొన్ని రోజులుగా విజయవాడ ధర్నా చౌక్‌లో పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్ సీల్లో పని చేస్తున్న పారా మెడికల్ సిబ్బంది, భోజన విరామ సమయంలో గురువారం నల్లబాడ్జీలు ధరించి వైద్యులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కో లోకేషన్ పీహెచ్‌సీ, చంద్రగిరి పారామెడికల్ సిబ్బంది, సూపర్ వైజర్ వాసుదేవరెడ్డి, శ్యామల, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఓగా షణ్ముగరాం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో గురువారం ఉదయం ఉద్యోగోన్నతిపై నూతన డిప్యూటీ ఎంపీడీఓగా షణ్ముఖ రామ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మను, తహశీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీదేవిని మర్యాద పూర్వకంగా కలిశారు.

శివయ్య సేవలో ఎంఎల్ఎ కన్నా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. ఏఈఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్యాట్ ఒలంపియాడ్ లెవల్ వన్ పరీక్షల్లో పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మ్యాథ్, ఫ్యాక్ట్, చాట్ విభాగాల్లో మొత్తం 167 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రూపాదేవి తెలిపారు. పాఠశాలలో అందిస్తున్న ఉన్నతప్రమాణాలతో కూడిన గుణాత్మక విద్య వల్లే విద్యార్థులు ఈ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని ఆమె తెలిపారు. ఏజీఎం శ్రీనివాసులు, డీన్ త్రివేణి, కల్పన, శ్రీహరి, వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయల్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ నగర్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజ్ విస్తరణ చేపట్టాలన్నారు. నిత్యం ఆ ప్రాంతంలో డ్రైనేజ్ వాటర్ ఫ్లో అవడం వల్ల, ఆ ప్రాంతంలో ఉండే ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే ఈ సమస్య పైన చర్యలు తీసుకుని వాటిని పరిష్కరించాలని కోరారు. తిరుపతిలోని గాంధీ రోడ్‌లో ఈట్‌స్ట్రీట్ చేపట్టాలని, ఇది కార్యరూపం దాల్చితే రోడ్డుసైడ్ ఉండే టిఫిన్‌షాపులు, ఫుడ్ షాపులు ఒకే చోటకు చేరుతాయని, పర్యాటకంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కొర్లగుంటలో వర్షపునీటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు, ప్రమోద్ పాల్గొన్నారు.

టీటీడీ రవాణా విభాగంలో ఆయుధపూజ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ రవాణా శాఖ విభాగంలో ప్రతి ఏటా నిర్వహించే ఆయుధపూజ గురువారం ఉదయం తిరుపతిలోని స్థానిక వర్క్‌షాపులో, సాయంత్రం తిరుమల డిపోలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డీఎం లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. వాహనాలను అలంకరించి ఆయుధపూజలను నిర్వహించారు.

నేడు మాజీమంత్రి కాకాణి రాక

ప్రజాశక్తి - వెంకటగిరి: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం వెంకటగిరికి రానున్నారు. వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎన్జీఓ భవన్‌లో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ గవర్నర్‌కు అందజేసే కోటి సంతకాల కరపత్రం ఆవిష్కరణ, ఇటీవల వైసీపీ రాష్ట్రస్థాయి పదవుల పొందిన నాయకుల సన్మానం, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని నేదురుమల్లి కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సైన్స్ పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తుందని గూడూరు జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం టవర్ క్లాక్ సెంటర్‌లో చెకుముకి సైన్స్ పరీక్ష గోడపత్రికలను జె.వి.వి. ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నామన్నారు. అక్టోబర్ 18న స్కూల్ స్థాయిలో, నవంబర్ 1వ తేదీన మండల స్థాయిలో సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్: నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫామింగ్, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా రాయలసీమ రీజియన్ జిల్లాల అఖిల బ్యారి బ్యాచ్ 47 మందికి శిక్షణ కార్యక్రమం తిరుపతి జిల్లా రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో 14 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమం తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. శిక్షణ కార్యక్రమంలో గురువారం మూడవ రోజు తిరుపతి రూరల్ మండలం వేమూరు అయ్యప్ప నాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బిఆర్సి యాజమాన్యులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల్లో కషాయాలు, జీవామృతం ఘన జీవామృతం, పంచగవ్య తయారీ విధానాలను ప్రత్యక్షంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎం ఎంటి సత్యనారాయణ, చిత్తూరు జిల్లా రిసోర్స్ పర్సన్ సుధాకర్, బిఆర్సి యజమానులు పాల్గొన్నారు.

చుట్టుగుంటలో కంపు.. కంపు

యథేచ్ఛగా మురికినీరు
మురికి నీరు వదులుతున్న ఓ విద్యా సంస్థ
నోటీసులిచ్చినా మారని తీరు



ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలోని సి రామా పురం గ్రామపంచాయతీ కార్యాలయానికి కూత వేట దూరంలోని చుట్టుగుంట మురికి నీటితో కంపు కొడుతుంది. స్థానిక ప్రజలు దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుంటున్నారు. తిరుపతి - రాయల చెరువు ప్రధాన రహదారి పక్కనున్న చుట్టుగుంట ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ విద్యా సంస్థకు సంబంధించిన మురికి నీటిని నిల్వకోసం పెద్ద సంపు ఏర్పాటు చేసి ఉన్నారు. ఆ సంపు నిండి మురికి నీరు మొత్తం చుట్టుగుంటలోకి చేరుతుండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల గ్రామంలో దోమల బెడద అధికమై వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గత మూడు నెలల క్రితం పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆ ఫిర్యాదుపై పంచాయతీ అధికారులు విద్యాసంస్థకు నోటీసులు ఇవ్వడంతో తాత్కాలికంగా మురికి నీటిని పంపింగ్ చేసుకునేందుకు విద్యుత్ మోటార్, పైపు లైన్లు ఏర్పాటు చేసి మురికి నీటిని సెప్టిక్ ట్యాంకుల ద్వారా బయటకు తరలిస్తామని, మురికి నీటిని చుట్టుగుంటలోకి చుక్క కూడా రానివ్వమని లికిత పూర్వకంగా అధికారులకు రాసిచ్చారు. కానీ ఆ తంతు పట్టుమని పది రోజులే జరిగింది. మరల యధావిధిగా మురికి నీరు మొత్తం చుట్టుగుంటలోకి ప్రవహిస్తున్నాయి. ఇకనైనా పంచాయతీ, ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి చుట్టుగుంటలో మురికి నీరు కలుస్తుండటం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులును వివరణ కోరగా త్వరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మొబైల్ యాప్‌తో శ్రీనిధి రుణాలు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న శ్రీనిధి రుణాలను ఇకపై మొబైల్ యాప్ ద్వారా సులువు పద్ధతిలో చెల్లించుకోవచ్చునని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపిఎం మునెయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలో శ్రీనిధి క్లస్టర్ మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీనిధి పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామలో జూడో క్రీడాకారుల ఎంపిక



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, జెఎన్టియు స్పోర్ట్స్ కౌన్సిల్ వారు అంతర్ జిల్లాల జూడో క్రీడాకారుల ఎంపికల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ మన్యం అరవింద్ కుమార్ రెడ్డి తెలిపారు. జెఎన్టియు అనంతపురం పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొని జూడో క్రీడలో తమ ప్రతిభను ప్రదర్శించారని, ఈ ఎంపికలకు న్యాయ నిర్ణేతగా గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రవిచంద్ర వ్యవహరించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అనంతపురం శాప్ ప్రతినిధులు గోపి ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, ఫిజికల్ డైరెక్టర్స్ పి.వినోద్ కుమార్, కె.లక్ష్మీసౌజన్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీసీఈఎఫ్ మహా సభను జయప్రదం చెయ్యండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మేమెంతో మాకంత–మనకోసం మన సభ పేరుతో ఈ నెల 19న గుంటూరులో జరగబోవు బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ద్వితీయ మహా సభను జయప్రదం చేయాలని బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బిసిఈఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ పిలుపునిచ్చారు. తిరుపతిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుంటూరులో జరిగే రాష్ట్ర ద్వితీయ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెనుకబడిన కులాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీఈఎఫ్ నాయకులు, బి.సి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్షిప్‌గా మహిళా డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినిలు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థినిలు ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను సాధించడం కళాశాలకు గర్వకారణం అన్నారు. బాస్కెట్ బాల్, కోకో, టేబుల్ టెన్నిస్ (సింగిల్స్ అండ్ డబుల్స్), టెన్ని కాయిట్ పోటీలలో విన్నర్లు గాను, బాల్ బ్యాడ్మింటన్ (సింగిల్స్ అండ్ డబుల్స్), కబడ్డీ, చెస్ పోటీలలో రన్నర్లు గాను, విద్యార్థినిలు విజేతలుగా నిలిచారన్నారు.

భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీఎం ఉష కార్యక్రమం కింద ఆంగ్లంలో భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై మొదటి కార్యశాల ఎంసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు గురువారం నిర్వహించారు. ఆంగ్ల శాఖ ఆచార్యులు హరిపద్మరాణి నిర్వహించిన ఈ కార్యశాలలో అమెరికా నుండి వచ్చిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫెలో ఆంజలా సూజన్ బకూలా కూడా విషయ నిపుణులుగా వ్యవహరించారు. ఆంగ్ల భాష, భావవ్యక్తీకరణలపై అపోహలను విద్యార్థినులలో తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ఈ కార్యశాలలు నిర్వహించినట్లు తెలిపారు.

సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాలు మేరకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాన్ని పట్టణ పార్టీ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, యూనిట్ ఇంచార్జ్ ఈశ్వర్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం పుత్తూరు మున్సిపాలిటీ, 19వ వార్డు, ఏ.జి కాలనీల్లో బూత్ ఇంచార్జ్ చెంచయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కుడుకుప్పం షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల ఫలాలతో సామాన్య ప్రజలకు సుమారు రూ.8 వేల కోట్లు ఆదా అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి డైరెక్టర్ ఉమాశంకర్ రెడ్డి, ఎస్టీ సెల్ నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి: నూతన జీఎస్టితో వినియోగదారులకు కలిగే లాభాలను గురించి అవగాహన కల్పించేందుకు తిరుపతి జీఎస్టీ శాఖ, ప్రాంతీయ రవాణా శాఖ సంయుక్తంగా చంద్రగిరిలోని టవర్ క్లాక్ వద్ద ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు షోరూమ్స్ యజమానులు పాల్గొన్నారు.

వాహన కొనుగోళ్లపై తగ్గిన జిఎస్‌టి

ప్రజాశక్తి - వెంకటగిరి : తిరుపతి జిల్లా, వెంకటగిరి పట్టణ పరిధిలో వాహనాలపై తగ్గిన జిఎస్టి గురించి అవగాహన కల్పిస్తూ గూడూరు ఇన్‌కమ్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎన్ మేఘనాథ్, రవాణా శాఖ ఎంవిఐ సునీల్ రెడ్డి, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకట రామి రెడ్డి, మునిసిపల్ మేనేజర్ సాంబశివయ్య పట్టణంలో వాహన షోరూం నిర్వాహకులు ఆటో డ్రైవర్లు వెంకటగిరి పట్టణంలోని ఉషోదయ కళాశాల ప్రాంగణం నుండి పోలేరమ్మ దేవస్థానం వరకు ప్రజలకి అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు.

డొక్కా సీతమ్మ అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద గురువారం జనసేన నాయకులు పేటా బ్రదర్స్ ఆధ్వర్యంలో 65వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనలో భాగంగా ప్రతి గురువారం క్రమం తప్పకుండా పేదల ఆకలి తీరుస్తున్నట్లు పేటా చిరంజీవి, పేటా చంద్రశేఖర్ తెలిపారు. ప్రదీప్ కుమార్, తేజ, మణి మహేష్, నవీన్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల ప్రజా పరిషత్ బిఎన్ కండ్రిగలో 28 పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ సెక్రటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఓయస్ఆర్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు శ్రీదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వెంకట రత్నమ్మలు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సర్వేయర్లు తప్పక హాజరు కావాలని తెలిపారు.

ప్రపంచ ఆహార దినోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థుల్లో ఆహార ప్రాముఖ్యత, పోషక విలువలు, ఆహార వృథా నియంత్రణపై అవగాహన కల్పించే కార్యక్రమం ప్రిన్సిపల్ డా. చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పెరుగుతున్న ఆహార కొరత గురించి విశ్లేషించారు. సమన్వయకర్త డా.పి.సుజనా మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో పోషకాహార ప్రాముఖ్యత ఎంతో గొప్పదన్నారు. ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు ఆహార పరిరక్షణపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త బాబురావు, వరలక్ష్మి, కెరీర్ కౌన్సెలింగ్ సమన్వయకర్త నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - వాకాడు: ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న యూరియా కార్డులను పొందాలని టిడిపి సీనియర్ నాయకుడు తుమ్మ మోహన్ నాయుడు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం వాకాడు మండల పరిధిలోని, కొండాపురం సచివాలయంలో వ్యవసాయ శాఖ అందిస్తున్న యూరియా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలనారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సహాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు చట్టాలు అమలు చేయాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు, చట్టాలు సరిగా అమలు చేయాలని, ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ సి.ఐ.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ పేర్కొన్నారు. చట్టాల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలలో పర్యటనలో భాగంగా గురువారం గూడూరు ఆర్టీసీ డిపోకి చేరుకున్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను కలసి వారి పనివిధానం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసి ఎస్.డబ్ల్యూ.ఎఫ్, సి.ఐ.టి.యు పట్టణ నాయకులతో కలిసి గూడూరు డిపో మేనేజరు లక్ష్మిని కలసి డిపోలో పనిచేస్తున్న స్వీపింగ్, వాషింగ్, వివిధ రకాల పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు కాంట్రాక్టర్ ద్వారా సరిగా అందేలా చూడాలని, హక్కులు, పనిగంటలు కార్మిక చట్టాలు, అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు డి. మల్లికార్జున, జిల్లా సహాయ కార్యదర్శి కె.ఎస్.వాసులు, గూడూరు డిపో అధ్యక్షలు రఘు రామయ్య, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో శ్రీదేవి సూచించారు. గురువారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శిరుగు రాజుపాలెం, తడుపు సర్పంచులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేణుగోపాలపురం, వివిఎస్ గ్రామాలకు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నాయని, రోడ్డు మరమ్మత్తుకలు చేపట్టాలని కోరారు. వివిఎస్ పురం గ్రామానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు స్పందించి సమస్యలను పై అధికరుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండల డిప్యూటీ తాహశీల్దార్, అశోక్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో భూ రీ సర్వే జరుగుతోందని, రైతులకు పక్కాగా సర్వే చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డులకు, దీపం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, ఉద్యానవన శాఖ అధికారి వెంకట సౌజన్యలు రైతు భరోసాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనాల కొనుగోళ్లలో జీఎస్టీ తగ్గింది: ఆర్టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఆర్టీవో మురళీమోహన్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టి– సూపర్ సేవింగ్స్ జీఎస్టీ 2.0 సంస్కరణ ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. వాహనాలకు కొనుగోళ్లలో జీఎస్టీ తగ్గిందని, ఈ విషయాన్ని అవగాహన కల్పించడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ స్పష్టం చేశారు. ఆటోమొబైల్స్ డీలర్ల ప్రతినిధులతో రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి తాజాగా మార్కెట్లోకి విడుదల అయిన నూతన మోడల్స్ ప్రదర్శించి ఈ వాహనాల కొనుగోళ్లపై జీఎస్టి తగ్గింపు తర్వాత వినియోగదారులకు లభించే మినహాయింపులు, సంస్కరణల ప్రభావం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు వనం వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్, రమణ నాయక్ పాల్గొన్నారు.

జీఎస్టీ ఫలాలు అందివ్వకుంటే చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సూపర్ జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజల దరిచేరకుంటే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదర్ నాయుడు, జీఎస్టీ డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ చిన్నారెడ్డి సంయుక్తంగా హెచ్చరించారు. స్థానిక శరవణ ఆటోమొబైల్స్ కార్యాలయంలో గురువారం శ్రీకాళహస్తిలోని ఆటోమొబైల్స్ డీలర్స్ కు సూపర్ జీఎస్టీ–2.0పై అవగాహన సదస్సును నిర్వహించారు. కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశ ప్రజలపై రూ.2 లక్షల కోట్ల మేర వస్తు, సేవా పన్ను మినహాయింపు దక్కుతుందన్నారు. మోటారు వాహనాల రంగంలో జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గిందనీ, తద్వారా వాహనాల కొనుగోళ్లు ఊపందుకుంటాయని పేర్కొన్నారు. ప్రతి ఆటోమొబైల్స్ డీలర్స్ దుకాణాల వద్ద తగ్గిన జీఎస్టీ వివరాల ధరల పట్టికను ఉంచాలని ఆదేశించారు. పాత ధరలనే అమలు చేస్తే జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. వాహనం కొనుగోలు చేసిన రోజునే తాత్కాలిక రిజిస్ట్రేషన్ జరగాలనీ, హెల్మెట్ కూడా విక్రయించాలనీ, ఆ నిబంధనలు పాటించని వారి డీలర్షిప్‌ను రద్దు చేస్తామని ఎంవీఐ దామోదర్ నాయుడు హెచ్చరించారు.

క్రైం న్యూస్

బైకును ఢీకొన్న టిప్పర్.. మహిళ మృతి



ప్రజాశక్తి- నాగలాపురం: నాగలాపురం మండలం, బయట కొడియం బేడు వద్ద పుత్తూరు–చెన్నై హైవేపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నాగలాపురం మండల సర్వేయర్ సునీత అక్కడి కక్కడే మృతి చెందగా, సర్వేయర్ దినేష్ గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సునీత సురుటుపల్లికి ఉదయం వెళ్లి అక్కడి గ్రామ సర్వేయర్ దినేష్‌తోపాటు సర్వే పనులు పూర్తి చేసుకుని సాయంత్రం నాగలాపురానికి ద్విచక్ర వాహనంలో తిరిగివస్తుండగా, వెనుక వైపు వస్తున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టైక్ చేయబోతూ బైకును ఢీకొంది. సునీత టిప్పర్ చక్రాల కింద పడడంతో సంఘటన స్థలంలో మృతి చెందింది. పిచ్చాటూరుకు చెందిన సురుటపల్లి గ్రామ సర్వే దినేష్ బైక్ నుండి పక్కవైపుకు పడడంతో గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు నాగలాపురం పోలీసులకు సమాచారం అందించగా ట్రైనీ ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐ షణ్ముగం సంఘటన స్థలానికి వెళ్లి సునీత మృతదేహాన్ని సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలకు, క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

లారీ ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చంద్రగిరి: గురువారం తెల్లవారుజామున చంద్రగిరి మండలం, మల్లయ్య పల్లిలో ఓ క్వారీలో పనిచేస్తున్న అనంతపురానికి చెందిన శేషగిరిరావు, క్వారీ నుంచి చంద్రగిరి వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతడిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అటవీ భూ వ్యవహారంలో రెవెన్యూ అధికారులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - సత్యవేడు : సత్యవేడు మండలం, వా నెల్లూరు అటవీ భూమి గోల్మాల్ వ్యవహారంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు రెవిన్యూ అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. సుమారు 300 ఎకరాల భూ కుంభకోణ విషయంలో సత్యవేడు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి నాయుడు దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రాథమికంగా దర్యాప్తులో కొంతమంది అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అక్రమ వ్యవహారం జరిగిన కాలంలో పనిచేసిన అధికారులను ప్రస్తుతానికి సస్పెండ్ చేశారు. అసలు దోషులు తేలితేగాని వీరి సస్పెన్షన్ వ్యవహారం ఓ కొలిక్కిరాదు. సత్యవేడు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా విధులు నిర్వహిస్తున్న సురేష్, వానెల్లూర్ వీఆర్వో రాఘవేంద్ర, సర్వేర్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ జగదీష్, తిరుపతి జిల్లా, పాకాల వీఆర్వో భార్గవ్, కర్నూలు జిల్లా తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రామాంజలి నాయుడులను సస్పెండ్ చేయగా, వ్యవసాయ సహాయకులు పూర్ణచంద్ర సస్పెన్షన్ ప్రక్రియలో ఉన్నట్లు స్థానిక తహశీల్దార్ రాజశేఖర్ ధ్రువీకరించారు.

వరదరాజన్‌కు సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అద్వైత వేదాంత విభాగ విద్యార్థి వరదరాజన్ శర్మకు శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీ వేద వేదాంత శాస్త్ర సభ ద్వారా అద్వైత వేదాంత రత్న బిరుదు పొందిన శుభ సందర్భంగా గురువారం అద్వైత వేదాంత విభాగం అధ్యాపకులు, ఉప కులపతి ఆచార్య జియస్ఆర్ కృష్ణమూర్తి సన్మానించారు. ఈ సందర్భంగా విసి కృష్ణమూర్తి మాట్లాడుతూ వరద రాజన్ అద్వైత వేదాంత రత్న బిరుదు పొందడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపరమాచార్య గురుకుల కేంద్ర డైరెక్టర్ ప్రొ.కె.గణపతి భట్, ఐ.క్యూ.ఎ.సి డైరెక్టర్ ప్రొ.సతీష.కె.ఎస్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యానికి చెక్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ అధికారి సూచనల ప్రకారం, జిల్లా వ్యాప్తంగా నకిలీ మద్యం, స్పిరిట్స్ పై తనిఖీలు చేపడుతున్నట్లు పుత్తూరు ఎక్సైజ్ అధికారి మురళీమోహన్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణాల యాజమాన్యాలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్‌తో మద్యం నకిలీని గుర్తించవచ్చున్నారు. అనుమానాస్పద మద్యం కనుగొనబడితే ఆ యాప్ ద్వారా సమాచారం పంపవచ్చని తెలిపారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం



ప్రజాశక్తి - వాకాడు: వైసీపీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, కొడవలూరు భక్తవస్థల రెడ్డిని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమించిన సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ, గూడూరు నియోజ కవర్గ ఇంచార్జి మేరిగ మురళీధర్ గురు వారం వాకాడులో సత్కరిం చారు. అనంతరం నాయకులు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో నేదురు మల్లి హిమ కుమార్ రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ పాపా రెడ్డి రాజ శేఖర్ రెడ్డి, గూడూరు నియో జకవర్గ వైసిపి నాయకులు పాల్గొ న్నారు.

యువతరంగమా.. యువగళమా?

➤ ఎస్వీయూలో "యువతరంగ్" కార్యక్రమంలో తెలుగు భాషకు అవమానం : విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో 16, 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న యువతరంగ్ కార్యక్రమంలో విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఆహ్వాన పత్రికల్లో కేవలం ఆంగ్లం, హిందీ భాషలలోనే అక్షరాలు ముద్రించగా, తెలుగు భాషకు చోటు ఇవ్వకపోవడం బాధాకరం అని వివిధ విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్టేజ్ బ్యానర్లు, బెలూన్లు టీడీపీ రంగులతో, యువగళం కార్యక్రమాన్ని తలపించేలా అలంకరించారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వైయస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్, నేషనల్ లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుందర్‌లు మాట్లాడుతూ యూనివర్సిటీలు టీడీపీ కార్యాలయాలుగా మారిపోయాయని విమర్శించారు. వాలంటీర్లకు, విద్యార్థులకు పసుపు రంగులో ఐడీ కార్డులు ఇచ్చారని, బయటి వ్యక్తులను కార్యక్రమంలోకి తీసుకువచ్చి విద్యార్థుల మీద ఆధిపత్యం చూపిస్తున్నారన్నారు. తక్షణమే హిందీ అక్షరాలతో ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించి తెలుగు అక్షరాలతో కొత్త బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బ్యానర్లు చింపివేసే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.